# ఆడదానికో దండం



చందు సోంబాబు

రమణకి ఇంజనీరింగ్ కాలేజీలో సీటు సులువుగానే దొరికింది. హాస్టల్లో ఉంటే స్నేహితులతోనూ, ఇతర వ్యాపకాలతోనూ చదువు అంతగా సాగదని అతని మేనమామ అతన్ని అద్దె గదిలో ఉండమని సలహా ఇచ్చేడు.

నిజానికి రమణ తండ్రికి అతన్ని ఇంజనీర్ని చేయగల స్తోమతు లేదు. అందుచేత అతని మేనమామ చెన్నకేశవులు అందుకు పూనుకున్నాడు.

చెన్నకేశవులు మేధావి. అతని కిప్పుడిప్పుడే పమిటలేస్తున్న 'పారిజాతం' అనే కూతురుంది. పారిజాతానికి ఒక్కసారిగా ఇంజనీరు మొగుణ్ని తెచ్చే అవకాశం అతనికి లేదు. ఆ సంగతి అతనికి తెలుసు. అందుచేత చవుకలో ఇంజనీర్ని అల్లుడిగా తెచ్చుకోడానికిగానూ రమణకి ఇన్‌స్టాల్‌మెంట్‌లో చదువు చెప్పించేస్తే ఏ చిక్కూ ఉండదని అభిప్రాయపడ్డాడు. అది నిజం కూడాను.

రమణ పుట్టి బుద్ధెరిగిన తరువాత సొంత ఊరినీ, తన వాళ్ళనీ వదిలి ఎప్పుడూ ఉండలేదు. అతను అమాయకుడు, బుద్ధిమంతుడు.

పట్నంలో అతనికి అద్దెగది తేలికగానే దొరికింది. అతనికి కొన్ని పరీక్షలు పెట్టి మంచివాడన్న నమ్మకం కలిగేక ఇల్లుగలాయన అతనికి గదిని అద్దెకిచ్చేడు.


ఇల్లుగలాయన పేరు కనకరాజు. ఆయన వృత్తిరీత్యా కాంట్రాక్టర్. బాగా సంపాదించేడు. ఆ ఇంట్లో కనకరాజు, అతని భార్యా, కొడుకూ, కోడలూ ఉంటున్నారు. ఇద్దరు కూతుళ్ళకి ఘనంగా పెళ్ళిళ్ళు చేసి పంపేశాడు. పెద్ద అల్లుడు డి. ఆర్. రాజు అమెరికాలో స్థిరపడిపోయేడు. చిన్నల్లుడు వి.సుబ్బారావు చిలకలూరిపేటలో బ్యాంకు ఆఫీసరుగా చేస్తున్నాడు.

కొడుకు వేణు బుద్ధావతారం. పెద్దగా చదువు అబ్బలేదు. అంచేత అదే ఊళ్ళో కనకరాజు అతనిచేత మెడికల్ షాపుని పెట్టించాడు. కోడలు తారకేశ్వరి. ఆస్తిపాస్తులని చూసి మగాడెలా ఉంటేనేం అన్న ధోరణిలో ఆమె తండ్రి వేణుతో తార పెళ్ళి జరిపించేశాడు.

తార ఆకర్షణగా ఉంటుంది. బొద్దుగా చామనచాయలో నిండుగా బంతిపువ్వులా గుమ్మటంలా ఉంటుంది.

తారకేశ్వరి కలుపుగోలు మనిషి. మెట్రిక్ వరకు చదివింది. ఆమెకి డిటెక్టివ్ నవలలు, మామూలు పత్రికలు చదవడం బాగా అలవాటు. ఇంట్లో అత్తగారికి పనిలో కాస్తంత సాయపడి తిని పడుకోవటం లేకపోతే ఏ కూనిరాగమో తీస్తూ ఏ పుస్తకమో చదువుకోవడం.

మొగుడు పటి బుద్ధావతారమే కాకుండా చిన్నసైజు గున్నేనుగులా ఉండటంతో




వేళకి కావల్సిన వదుపాయాలని చూడటం మినహాయించి ఓ సరదా కోసమో, ముచ్చట కోసమో మొహంవాచి కూచోడం ఆమె ఎప్పుడో మరచిపోయింది. రమణని చూసి బోలెడంత ముచ్చట పడింది తార.

'మంచి కుర్రాడు' చాకులా ఉన్నా డనుకొంది. అదీగాక అతను తనతోటి వయసు వాడు. చదువుకొంటున్నాడు.అతని వల్ల తనకి మంచి కాలక్షేపం అవుతుందని ఆమె గంపెడంత ఆశపడింది. రమణకి అద్దెకిచ్చిన గది మేడపైన తన పడకగది పక్కనే కావడంతో మరింత అనువుగా కూడా అనిపించింది తారకి.

అత్త, మామ కిందే ఉంటారు. మామ గారు కాంట్రాక్టులపైన ఎక్కువగా ఊళ్ళ పైనబడి తిరుగుతుంటాడు. అత్త మేడ మెట్లు ఎక్కలేదు. అందుచేత రమణతో మంచి కాలక్షేపం అవుతుందని ఆనంద పడింది తార.

అతను అద్దె గదిలో దిగి పది రోజు లయింది. ఈ పది రోజుల్లోనూ తార అతన్ని బాగా చదివేసింది.అతని పనులేవో అతనికేగానీ తనని పట్టించుకోక పోవడం తారకి కొంత బాధని కలిగించింది.

ఉదయం నాలుగు గంటలకి లేస్తాడు. తెల్లారే వరకూ చదువుకొంటాడు. తరువాత స్నానం చేసి తొమ్మిదిగంటలకి కాలేజీకి వెళతాడు. సాయంత్రం కాలేజీ నుంచి వచ్చి మళ్ళా స్నానం చేసి కూజాలో నీళ్ళు పట్టుకుని గదిలోకి వెళ్ళిపోతాడు. రాత్రి ఏ ఎనిమిది గంటలకో భోజనంచేసి వస్తాడు.

ఈ విధమైన అతని దినచర్య తారకి చాలా వరకూ ఆశాభంగాన్ని కలిగించింది. రమణని తనే ముందుగా పలకరించాలని నిశ్చయించుకొంది తార.

ఆ రోజు సాయంత్రం ఎప్పుడవుతుందా అని కళ్ళలో వత్తులేసుకొని మేడ మీద గదిలో కిటికీ దగ్గరే ఎదురుచూస్తూ నిలబడింది.

రోడ్డుమీద మెల్లగా అతను నడిచి రావటం చూసేక ఆమె ఆనందంతో పొంగిపోయింది.

అతను తన గది ముందుకి రాగానే అతన్ని చూసి సన్నగా నవ్వింది. అతను తిరిగి నవ్వి గది తాళం తీసి లోపలికెళ్ళిపోయాడు. తార కిందికి వెళ్ళి గ్లాసుతో కాఫీ తీసుకొచ్చి అతని గది గుమ్మంలో నిలబడింది. ఆ సమయంలో రమణ డ్రెస్ ఛేంజ్ చేసుకోబోతున్న వాడల్లా సిగ్గుపడి టవల్‌ని చుట్టేసుకున్నాడు.

తార అందంగా నవ్వి-

"మగాడివి, అంత సిగ్గెందుకు?"అంది చొరవగా.

రమణ అదోలా నవ్వి,

"మ గా ళ్ళు సి గ్గు పడకూడదా?" అన్నాడు.

చేతి గ్లాసులో కాఫీని మరో గ్లాసులోకి సగం ఒంపి,

"ఫర్లేదు. మాట్లాడగలవే. ఇదుగో ఈ కాఫీ తీసుకో" అంది తార.

"నేనిప్పుడే దారిలో తాగొచ్చాను" అన్నాడు రమణ.

"చాల్లే బడాయి. కాఫీ ఎన్నిసార్లు తాగినా ఏంకాదు. అయినా నీకోసం ఏమీ నేను తేలేదు. నేను తాగే వేళకి వచ్చేవు కనక 'ఫిఫ్టీ షేర్ ఇస్తున్నాను'అంతే"అంది తార తియ్యగా నవ్వుతూ.

రమణ ఆమె చేతిలోంచి గ్లాసుని అందుకున్నాడు.

అప్పుడు తన చేతిని అతనికి తాకించడానికి ప్రయత్నించింది తార.

"ఇప్పుడు నాకు నచ్చావు. నాకు నేను చెప్పిన మాట వినేవాళ్ళంటే చాలా పెద్ద ఇష్టం" అంటూ మనోహరంగా నవ్వింది తార.

రమణ మాట్లాడకుండా కాఫీ తాగి గ్లాసుని బల్లమీద పెట్టబోతూ ఉంటే ఆమె అందుకుంది.

తార గదిని పరీక్షగా చూసి:

"ఛీ. గదిని ఏమిటంత చిరాకుగా అట్టి పెట్టుకున్నావు?రేపు కాలేజీకి వెళ్ళేటప్పుడు నాకు తాళం ఇచ్చివెళ్ళు. గదంతా చక్కగా సర్ది పెడతాను" అంది.

"ఎందుకు మీకు శ్రమ?" అన్నాడు నసుగుతూ రమణ.

తార మందలింపుగా చూసింది.

"చాకులాంటి కుర్రాడివి, ఇంజనీరింగ్ స్టూడెంటువి, ఎలా ఉండాలో తెలుసా?"

రమణ చిన్నగా నవ్వాడా మాటలకి.

"సర్లే-నువ్వెలా ఉండాలో నేను నేర్పుతాను. పోతే నీ దగ్గిర పుస్తకాలేమైనా ఉన్నాయా?"

"లేవు".

"నాకు పుస్తకాలంటే ఇష్టం" అంది తార.

"అలాగా!"

"ఛీ ఒట్టి మొద్దబ్బాయివి. అలాగా అనకపోతే తెచ్చిపెడతానని అనలేవూ" అంటూ తార బయటికి వెళ్ళిపోయింది. రమణ ఊపిరిపీల్చుకున్నాడు. వాన వెలిసినట్టుగా అనిపించిందతనికి.

మర్నాడు రమణ సాయంత్రం గదిలోకి అడుగుపెడుతూనే చాలా ఆశ్చర్యపడ్డాడు. గది చాలా నీట్‌గా సర్ది ఉంది. టేబుల్‌పైన చిన్న కాగితం ఉంది. దాని మీద రాసివున్న అక్షరాలు రమణ చదివేడు.

"మొద్దబ్బాయి, ఇప్పుడు గదెలా

ఉంది?"

—తార

అనుకోకుండా వెనక్కి తిరిగి చూశాడు రమణ.

గుమ్మానికానుకుని తార నిలబడి ఉంది.

"థాంక్స్" అన్నాడు చిరునవ్వు నవుతూ రమణ.

" 'నచ్చింది' కదా" అని వత్తి పలికింది తార.

"ఊఁ" అన్నాడు.

"నేనేంచేసినాఅలా నీట్‌గానేచేస్తాను" అంది తార లోపలికొచ్చి మంచంపైన కూర్చుంటూ. అతను తారకేసి చూశాడు. ఆమెకోసం తను తెచ్చిన పత్రికని చేతిలోకి తీసుకుని చూస్తోంది తార.

'మీ కోసమే తీసుకొచ్చాను' అని చెప్పాలనుకున్నాడు. కానీ అలా చెబితే ఆమె ఏమనుకొంటుందో అనే ఉద్దేశంతో అసలు ఏమీ చెప్పలేకపోయాడు.

"రమణా" అని పిలిచింది తార.

"ఊఁ"

"నువ్వు అచ్చం హీరోలా ఉంటావు తెలుసా?"

ఆమె మాటలకి అతను సిగ్గుపడ్డాడు. తార అందంగా నవ్వింది.

"నువ్వు కొంచెం స్టయిల్‌గా తయారైతే నిన్నిట్టే కాలేజీ అమ్మాయిలు ఎగరేసుకుపోతారు."

రమణకి ఆమె మాట్లాడే తీరు చూశాక అతనిలో ఉన్న భయం చాలా వరకూ తగ్గిపోయింది.

"నువ్వు ఇకనుంచీ రోజూ 'టక్' చేసుకోవాలి. క్రాఫ్‌ని అమితాబ్ స్టైయిల్లో పెంచాలి. నీకు చెప్పడం దేనికిలే అదంతా నేను చూసుకొంటానుగా" తార క్రీగంట అతన్ని చూస్తూ అంది.

"నేను స్నానంచేసి వస్తాను"అన్నాడు రమణ.

"వెళ్ళిరా. నేనిక్కడే ఉంటాను" అంది.

పది నిముషాల్లో రమణ స్నానంచేసి గదిలోకిరాబోయినవాడల్లా ఆగిపోయాడు.

తార మంచంపైన పడుకొని పత్రిక చదువుతోంది. ఆమె పవిట పక్కకి తొలిగి ఆమె ఉన్నత శిఖరాలు బ్లౌజు లోంచి బయటికి దోపిడీ దొంగల్లా తొంగి చూస్తున్నాయి. మోకాళ్ళ వరకూ చీర చెదిరి నున్నని కాళ్ళు బంగారు స్తంభాల్లా కనబడుతున్నాయి.

రమణ రెండు క్షణాలు అలాగే నిలబడి పోయాడు. తను చూస్తున్నట్టు ఆమె గమనిస్తే ఏమనుకొంటుందోనని భయపడ్డాడు.

"అక్కడే నిలబడి పోయావే. లోపలికి రా" అన్నది తార. ఆమె సర్దుకోడానికి ఏ విధమైన ప్రయత్నమూ చెయ్యలేదు. రమణ తల విదిలించుకొని గదిలోకి నడిచాడు.

అప్పుడు తార లేచి కూర్చుంది.

రమణ అద్దంలో చూసుకొంటూ తల దువ్వుకొంటున్నాడు.

"ఏమిటా దువ్వుకోడం ఒట్టి మొద్దువి బాబూ" అంటూ అతని దగ్గరగా వచ్చి అతని చేతిలోంచి దువ్వెన అందుకొని

"ఇటు తిరుగు నేను దువ్వుతాను" అంది.

రమణ ఆమెకేసి అదోలా చూసేడు. తార అతని తల దువ్వి ఒకసారి పరీక్షగా చూసి.

"బ్యూటిఫుల్. ఇప్పుడు చూసుకో అద్దంలో. ఆడపిల్లలకి వెర్రెక్కేలా కనబడుతున్నావు" అంది.

రమణ నవ్వి ఊరుకున్నాడు. అతను తిరిగి ఏ విధమైన సమాధానం చెప్పక పోవడంతో తారకి కోపం వచ్చింది.

"నేనిన్ని మాటలు మాట్లాడుతున్నా అన్నింటికీ అలా ముక్తసరిగా మాట్లాడతావేం. అది మానర్స్ కాదు. ఇష్టంలేకపోతే చెప్పు-నీ గదిలోకి రాను" అంది తార విస్ఫూరంగా.

"అబ్బే అదేం లేదు" అన్నాడు రమణ. అతని మాటలు వినకుండా తార విసవిసా బయటికి వెళ్ళిపోయింది. ఆమెకి అకారణంగా కోపం వచ్చినందుకు అతను చాలా నొచ్చుకున్నాడు.

వారం రోజులపాటు తార అతను కనబడినా చూసీ చూడనట్టు ఊరుకొంది. దానితో ఆమెకి కనబడి 'సారీ' చెప్పకోవాలనుకున్నాడు రమణ.

రమణ ఆ సాయంత్రం కాస్త ముందుగా ఇల్లు చేరాడు. రమణ మేడమెట్లు ఎక్కి ముందుకు పోబోతూ తార గది ముందు ఆగి చూశాడు. గది మధ్యలో నిలబడి ఆమె.... జాకెట్‌ని తొడుక్కుంటోంది. అది చూసి రమణ అడుగు ముందుకేయబోయాడు ఆమె ఏమనుకొంటుందోనన్న భయంతో.

"ఏయ్ వెళ్ళిపోతున్నావే-ఓసారిలారా" అంది తార.

రమణ ఒక్క క్షణం ఆగేడు.

లోపలికి వెళ్ళాలా? వద్దా? ఆమెకి అసలే కోపం ఎక్కువ. లోపలికెళ్ళకపోతే ఆమె అగ్గిమీదగుగ్గిలం అవుతుంది. ఎందుకు పిలుస్తూందో?

రమణ మెల్లిగా లోపల అడుగు పెట్టాడు.

"ప్లీజ్-ఈ హుక్స్ పెట్టవూ?"అంటూ వెనక్కితిరిగి నుంచుంది తార.

బుజ్జి కవిత :

అకు తిరగబడితే
అన్నమే లేదు నీకు!

## ముక్కోపనిషత్తు!

వంచి చెడూ కలగలుపుగా
పీల్చక తప్పదొరే....
అనక మనం బతకాలీ అంటే
మంచే కదా వంటబట్టాలి
చెడ్డనేమో విసిరికొట్టాలి
ఇదేరా తండ్రీ
జగత్ ప్రాణాధార
ముక్కోపనిషత్తు!

బుజ్జి కవిత :

ఇంటింటా వెలుగుతూన్న
అంటరాని దీపాన్ని
నేను

—రంధి సోమరాజు

రమణ క్షణంపాటు ఆలోచించాడు. మనసులో ఏమనుకున్నాడోగానీ వెంటనే ఆమె వేసుకున్న బాక్ ఓపెన్ జాకెట్ హుక్స్ పెట్టేసి గబగబ బయటికి నడవబోయేడు.

తార గభాల్న అతని చేతిని పట్టుకొని "తొందరేం, నా గదిలో కాస్సేపు కూర్చోకూడదా?" నవ్వుతూ అతనికేసి చూస్తూ అంది.

"నాకు తలనొప్పిగా ఉంది. వెళ్ళి పడుకుంటాను."

"ఇక్కడే పడుకోవచ్చుగా" అతని దగ్గరగా వచ్చి అతని భుజాలుగుచ్చి పట్టుకుని అంది తార.

"ప్లీజ్ నేను వెళ్ళిపోతాను" అన్నాడు.

తార గమ్మత్తుగా నవ్వింది.

"నిన్ను లోపలికి పిలిచింది వెళ్ళిపోనివ్వడానికనుకున్నావా?" అంటూ అతను ఊహించనంత వేగంగా అతని చెంపల పైన ముద్దు పెట్టుకొంది తార.

రమణ చేతిలో పుస్తకాలు కింద పడినై. అతను గబగబ కిందపడిన పుస్తకాలని ఏరుకుని బయటికి వెళ్ళిపోతుంటే తార పడీ పడీ నవ్వింది.

రమణకిది తొలి అనుభవం. గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుని అరగంటపాటు బయటికి రాలేకపోయాడు. అతనికి అంతా గజిబిజిగా ఉంది.

మర్నాడు రాత్రి వరండాలో నిలబడి భర్తని రెండో ఆటకిసాగనంపుతున్న తారని చూశాడు రమణ. అయినా అదేమీ పట్టించుకోకుండా తన ధ్యాసలో తను చదువుకుంటూ కూర్చున్నాడు.

గుమ్మంలో చప్పుడైతే చూశాడు రమణ. తార లోపలికొస్తూనే తలుపుల్ని వేసేసింది.

రమణ "ప్లీజ్ బయటి కెళ్ళిపోండి" అన్నాడు.

"ఆయన సినిమా కెళ్ళారు. నాకు చచ్చేంత బోరుగా ఉంది. కాసేపు పేకాట ఆడుకుందాం" అంది.

"పేకాట ఆడుకోడానికి తలుపులెందుకు వేయడం?" అడిగాడు రమణ.

"పిచ్చి మొహం. నీకెలా చెబితే అర్థం అవుతుందో తెలీడం లేదు. ఇంట్లో మామగారున్నారు"....అంటూ రమణ దగ్గరగా వచ్చి కుర్చీ వెనక నిలబడి అతని మెడ చుట్టూ చేతులు వేసి చుట్టింది.

"తప్పు. మీరిలాంటి పనులు చేయకూడదు. మీకు పెళ్ళయింది."

"పెళ్ళయితే?" ఎదురు ప్రశ్నవేసింది తార.

"ముందు బయటికెళ్ళు" తీక్షణంగా అన్నాడు రమణ.

అతని మాటలకి తార మొహం ఎర్రబడింది. అహం దెబ్బతిన్నది.

"ఛీ, నువ్వు మగాడివేనా?"

"నీ కనవసరం" అన్నాడు అసహనంగా.

అంతే. తార జాకెట్ని చింపేసుకుంది. రమణ ఆమెను విస్మయంగా చూస్తున్నాడు. జుత్తు పీక్కుని.... చేతి గాజులు పగలగొట్టేసుకుంటోంది.

"ఏమిటిది?" అన్నాడు కంగారుగా.

"ఏమిటో చూద్దూగానీ...."అంటూ గబగబ తలుపులు తెరిచేసి ఒక్కసారిగా ఏడుపుతో కేకలుపెట్టడం మొదలుపెట్టింది తార.

ఆమె కేకలకి కంగారుపడి రమణ ఆమె దగ్గరకి పరుగెత్తి గట్టిగా నోరు నొక్కి...

"ప్లీజ్ అరవకు. నీ ఇష్టం...." అంటున్నాడు. అదే సమయంలో అతని జుట్టు పట్టుకుని ఎవరో పక్కకి లాగి విసిరి కొట్టినట్టయింది. క్రిందపడి మొద్దుబారిపోతున్న మెదడునీ ఆలోచననీ అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నిస్తూ చూశాడు రమణ.

ఎదురుగా కనకరాజు. ఉగ్రనరసింహస్వామిలా నిలబడి ఉన్నాడు. కనకరాజుని చూడగానే రమణ పైప్రాణాలు పైనే పోయినాయి.

తార తలుపు పక్కన నిలబడి ఏడుస్తోంది.

"ఈ ఇంటి పరువు బజారు కెక్కడం ఇష్టంలేక నిన్ను వదిలేస్తున్నాను లేకపోతే పోలీస్ స్టేషన్లో పెట్టించి నీ ఎముకలు విరగ్గొట్టించే వాడిని. బయటికి పో" అంటూ మోకాలితో అతని డొక్కలో పొడిచాడు కనకరాజు.

"అతన్ని వెంటనే ఇల్లు ఖాళీ చేసేయమనండి మావగారూ! సమయానికి మీరే రాకపోతే నేనేమయిపోయేదాన్నో" అంది తార వెక్కిళ్ళ మధ్యగా.


రమణ 'ఇదంతా అన్యాయం, నాకేం తెలీదు' అని అరవాలనుకున్నాడు. కానీ తనని నమ్మేదెవరు? నిస్సహాయస్థితిలో ఏం చేయడానికీ తోచక బొమ్మలా నిలబడిపోయాడు.

కనకరాజు అతని సామాన్లు గదిలోంచి బయటకి విసిరేశాడు. జరుగుతున్నది అన్యాయమే కానీ దాన్ని ఆపేదెవరు? దేవుడున్నాడా?

రమణ కళ్ళల్లో నీరు తిరుగుతుండగా వాళ్ళకేసి ఓసారి చూసి బయటికి నడిచాడు.

* * *

అతికష్టంపైన తిరిగి అద్దెగదిని సంపాదించాడు రమణ. ఇంటివాళ్ళు చాలా మంచి



వాళ్ళు. ఆ సంగతి రమణ నాలుగు రోజుల్లోనే గ్రహించాడు. ఇల్లుగలాయన పేరు రాఘవులు. స్టేట్ గవర్నమెంటులో ఆయనకి ఉద్యోగం. ఆయనభార్య శాంత. వాళ్ళకి ఓ కొడుకు, కూతురు. కొడుకు ఎయిత్ క్లాసు చదువుతున్నాడు. పేరు శీను. కూతురు పేరు వసంత. ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది.

రోజూ ఉదయం శీను రమణకి కాఫీ తెచ్చిస్తాడు. మొదట్లో మొహమాట పడినా రాఘవులుగారు నచ్చ జెప్పటంతో రమణ ఉదయం కాఫీ వారింట్లోనే తీసుకోడానికి అంగీకరించాడు. వసంత కూడా రమణ ఎదురుపడితే చిరునవ్వుతో పలకరిస్తుంది. రమణకి ఆ ఇంటి వాతావరణం బాగా నచ్చింది. చదువు కూడా బాగా సాగుతోంది.

ఆ పూట బావి దగ్గర స్నానం చేస్తున్నాడు రమణ. సబ్బుతో ఒళ్ళు రుద్దుకొంటున్న అతని చూపు గది కిటికీ దగ్గర పడింది.

కిటికీలోంచి వసంత అతన్ని దీర్ఘంగా చూస్తోంది. రమణకి ఎక్కడలేని సిగ్గు ముంచు కొచ్చింది. అండర్ వేర్‌తో స్నానం చేస్తున్నాడు. ఆడపిల్ల అంత పరీక్షగా చూస్తుంటే సిగ్గేయదా! వసంత సిగ్గు మొగ్గలేసే వయసులో చూడ ముచ్చటగా ఉంటుంది. లంగా ఓణీ వేసేవయసే అయినా బొమ్మలా చూడగానే ఆకర్షించే విశేషం ఆమెలో ఉంది. రమణ తనని చూడ్డం గమనించి కాబోలు వసంత లోపలికి వెళ్ళిపోయింది.

రమణ స్నానం చేసి గదికొచ్చి టవెల్‌తో తల తుడుచుకొంటూ ఉండగా,

"గురూ గారూ." అంటూ శీను కాఫీ కప్పుతో లోపలికొచ్చాడు.


"బల్లమీద పెట్టు" అన్నాడు రమణ.

శీను కాఫీ కప్పుని బల్లపైనే పెట్టి ఇంకా ఏదో పని ఉన్న వాడిలా నిలబడ్డాడు.

"ఏం కావాలోయ్- అలా చూస్తున్నావు" అన్నాడు రమణ నవ్వుతూ.

"గురూగారు ఓ ఫైవ్ ఉంటే కావాలి. దోస్తులతో సినిమా ప్రోగ్రాం ఉంచె." అన్నాడు.

"అలాగే" అంటూనే హేంగర్‌కి తగిలించి ఉన్న చొక్కా జేబులోంచి




అయిదు కాగితం తీసి అందించాడు. ఆ కాగితాన్ని చూడగానే కళ్ళు పెద్దవయినై. అడగడం అడిగేడు కానీ అయిదు రూపాయలు అతనిస్తాడని శీను అనుకోలేదు. అయిదు రూపాయలొక్కసారిగా తండ్రి కూడా ఇవ్వలేదెప్పుడూ. స్కూల్‌కి వెళ్ళేటప్పుడు రోజూ అర్ధ రూపాయి ఇస్తాడు తండ్రి. సెలవురోజు అదీ ఇవ్వడు. రమణ పైన ఆ దెబ్బతో వాడికి గౌరవం పెరిగిపోయింది- 'గురూగారు చాలా మంచివారు' అని.

"ఏవండీ, నా కిలా ఫైవ్ ఇచ్చినట్టు ఇంట్లో చెప్పరుగా" అనుమానంగా అడిగాడు.

"చెప్పన్లే" అన్నాడు రమణ. శీను పరుగెత్తుకెళ్ళిపోయాడు. శీను వెళ్ళిన అయిదు నిమిషాలకి గది ముందు కాలి గజ్జెల చప్పుడైంది. తలెత్తి చూశాడు రమణ. వసంత!- గది గుమ్మం పట్టుకొని నిలబడింది.

"అంకుల్" అని పిలిచింది.

రమణ ఆమెకేసి చూశాడు.

"ఈ వేళ పండగని అమ్మ మిమ్మల్ని భోజనానికి ఉండమని చెప్పింది." అన్నది నాజూగ్గా వసంత.

రమణ తల ఊపడంతో వసంత వెళ్ళిపోయింది. వాళ్ళింట్లో రమణ భోజనం చేస్తుండగా శాంత చెప్పింది

"వసంతకి లెఖ్ఖలు సరిగా రావు బాబూ. మీకు తీరిక ఉన్నప్పుడు కాస్త అమ్మాయికి లెఖ్ఖలు చెప్పాలి."

"అలాగేనండీ" అన్నాడు రమణ.

ఆ రోజు నుంచీ వసంత రోజూ సాయంత్రం ఆరునుంచి ఏడు గంటల వరకు రమణతో లెక్కలు చెప్పించుకోవడం మొదలు పెట్టింది.


వసంత వినయ విధేయతలు అతనికి బాగా నచ్చినై. ఆమెకి తనంటే చాలా ఇష్టం అన్న అభిప్రాయానికొచ్చాడు. అతను లెక్కలు చేసి చూపించేటప్పుడు ఆశ్చర్యంగా అతని మొహంలోకే చూస్తూ ఉంటుంది వసంత.

ఆమె లెక్క చేస్తోంది. ఆమె కేసే చూస్తున్నాడు రమణ. ఆమెని దగ్గరగా తీసుకుని ముద్దు పెట్టుకోవాలని ఉంది రమణకి ఆమె జాకెట్టులోంచి కనబడుతున్న పాలవయసు అతన్ని రెచ్చ గొడుతోంది.

చేస్తున్న లెక్కని ఆపి తలెత్తి చూసింది వసంత. ఏదో అడగాలనుకొంది కానీ అతను తననే చూడటం- ఆ చూపుకి ఇబ్బందిగా తలొంచుకుంది వసంత. మగవాడి చూపుని చాలా తేలికగా అర్థం చేసుకోగల నేర్పుని దేవుడు ఆడవాళ్ళకిచ్చాడు.

"లెక్క తెలీలేదా!" అంటూ ఆమె ఒడిలోంచి పుస్తకాన్ని అందుకొంటూ చేతిని ఆమె నడుముకి తగిలించి చిన్నగా నవ్వాడు.

"ఈ రోజుకి వెళ్ళిపోతాను అంకుల్" అంది తలెత్తకుండానే వసంత.




అది అదనుగా తీసుకున్నాడు రమణ. తనేంచేసినా ఆమె అభ్యంతరం పెట్టదన్న నమ్మకం అతనికేనాడో కలిగింది. దరిదాపు ఆ ఇంట్లో చేరి రెండు నెలలు దాటింది. వసంత తనకి పూర్తిగా అర్థం అయిపోయింది. అదీగాక ఆ ఇంట్లో అందరికీ తనంటే అభిమానం. ఇక తనదే ఆలస్యం!

"వసంతా!" అంటూ ఆమె భుజం పైన చెయ్యి వేశాడు రమణ.

వసంత బెదురు చూపులు చూసింది.

"ఏమిటంకుల్" అంది అతని చేతిని తీసేస్తూ.

"నువ్వంటే నాకెంత ఇష్టమో తెలుసా?" అంటూ వంగి ఆమెని ముద్దు పెట్టుకోబోయాడు రమణ. అంతే.

రమణ ఊహించనంత వేగంగా వసంత అతని చెంప పగిలేలా కొట్టింది. పుస్తకాలు అక్కడే పడేసి ఏడుస్తూ పరుగెత్తు కెళ్ళిపోయింది.

రమణ నిశ్చేష్టుడయ్యాడు.

వసంతని లెక్కకట్టడంలో తనెక్కడో పొరపాటు చేశాడు. ఏ స్టెప్ తప్పిందో అతనికి అర్థం కాలేదు. వసంత తల్లీ తండ్రికి తెలిస్తే పరువు దక్కదు. వసంత చెప్పకుండా ఊరుకొంటుందా? ఒకసారి జీవితంలో అనుభవమైన పరాభవం తిరిగి మళ్ళీ ఎదురు కాబోతోంది. అతనికి కాళ్ళ కింద భూమి కదులుతోంది. తనలో అసలెలా కలిగింది ఆ బలహీనత? వసంత అద్దు చెప్పదన్న ధోరణిలో చొరవ చేశాడు.

అతను లేచి నిలబడుతూ గుమ్మంకేసి చూశాడు.

అప్పటికే రాఘవులు, కాంతా లోపలికొస్తున్నారు. రమణ గుటకలు మింగుతూ వాళ్ళకేసి చూశాడు.

"రమణా" రాఘవులు పిలిచాడు. ఆయన కంఠం కాంత గంభీర స్వరంతో పలికింది.

రమణ తలెత్తి చూశాడు. "ఊఁ" అన డానికి కూడా గొంతు పెగలని పరిస్థితిలో రాతి బొమ్మలా నిలబడిపోయాడు.

"రమణా" అని మళ్ళీ పిలిచేడాయన.

"నువ్వు మగాడివి. నువ్వు ఆడపిల్ల విషయంలో తొందరపడటంలో తప్పు లేదు. కానీ అమ్మాయి తొందరపడి కొట్టినందుకు నేను విచారిస్తున్నాను."

ఆయన మాటలకి ఆశ్చర్యంగా చూశాడు రమణ.

"చూడు బాబూ. నీకు వసంత నచ్చిందా? దాన్ని పెళ్ళిచేసుకుంటావా?"

ఇప్పుడు రాఘవులు అడిగిన ప్రశ్నకి తల దించుకున్నాడు రమణ. అతనికి తల తిరిగిపోతోంది. మేనమామ చదివిస్తున్నాడు తనని. పారిజాతం తనపైన ఎన్నో ఆశల్ని పెట్టుకొంది. వసంతని చేసుకోడం అంటే తన రంగుల భవిష్యత్తుని నిలువునా ఖూనీ చేసేసుకున్నట్టే లెక్క. తనని చదివించగలిగిన స్తోమత రాఘవులుకి లేదు. వసంతపట్ల ఆకర్షితుడయ్యాడే గానీ ఆమెని పెళ్ళి చేసుకోవాలన్న తలంపు అతనికి లేదు.

రమణ సమాధానం చెప్పకపోవడంతో రాఘవులు అన్నాడు:

"పెళ్ళి ఇష్టంలేదనుకొంటాను. అమ్మాయితో ఏదో కాలక్షేపం చేసి వెళ్ళిపోవాలనుకున్నావు. అంతే కదూ! చూడు. నీ లాంటి వాడికి గదిని అద్దెకివ్వడం ఆడపిల్ల తండ్రిగా నాది తప్పే. నాకు బాగా బుద్ధి చెప్పావు. చూడు. వెంటనే గది ఖాళీ చేసి వెళ్ళిపో. ఏమంటావు కాంతా?" అన్నాడు రాఘవులు.

కాంత కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఆ కళ్ళనించి తన బిడ్డకింత అవమానం జరిగిందే అన్న బాధతో కన్నీరు జారుతోంది. ఆమె ఒక్కో అడుగే ముందుకేస్తూ రమణ దగ్గరగా వెళ్ళింది.

"ఏం బాబూ. నీకిది ధర్మమేనా?" అడిగింది కాంత.

రమణకి వాళ్ళడిగే ఒక్కో ప్రశ్న ఒక్కో కొరడా దెబ్బలా తగులుతోంది.

"మాట్లాడవేం బాబూ; నిన్నీ ఇంట్లో మనిషిగానే అనుకున్నాం. ఈ చేతులతో నీకు అన్నం పెట్టాను. నా బిడ్డ జీవితంతో ఆటలాడాలనుకొన్నావా. ద్రాష్టుడా" అంటూనే ఆవేశంతో కాంత రమణ చెంపలు అదిరిపోయేలా కొట్టింది-

రాఘవులు జోక్యం చేసుకోలేదు. తమాషాగా నవ్వేడు.

"కన్నతల్లి కదూ! బిడ్డకు జరిగిన అన్యాయాన్ని భరించలేకపోయింది. నేను తండ్రిగా నీ ప్రాణాల్ని తీసి ఉండాల్సింది. కానీ బిడ్డల భవిష్యత్తుని గుర్తుంచుకొని నిన్ను వదిలేస్తున్నాను. సామాను సర్దుకో. రిక్షా పిలుస్తాను" అన్నాడు రాఘవులు.

మెత్తటి చెప్పుతో కొట్టినట్టుగా అతనన్న మాటలకి ఆత్మహత్య చేసుకోవాలన్న భావన కలిగింది రమణకి.

కోరి దగ్గరకొచ్చిన ఆడదాన్ని కాదని ఆ రోజు పరాభవింపబడ్డాడు. మనసు పడుతోందని భావించి చొరవచేసి ఈనాడు ఘోరంగా ఆడవాళ్ళతో దెబ్బలేతిన్నాడు. ఆడదాన్ని అర్థం చేసుకోడం అంటే సముద్రం లోతుని కొలిచినట్టే. ఆడది కనబడితే ఓ దండం పెట్టేసి పక్కకి

తప్పుకోవాలి. అది ఆరోగ్యానికి మంచిది.

*　*　*

రమణకి ఇంజనీరింగ్ పూర్తికాలేదు. కాని చెన్నకేశవులు హడావుడిగా రమణతో పారిజాతం పెళ్ళిని జరిపించేశారు.

మొదటిరాత్రి పారిజాతం గదిలోకి వచ్చినప్పుడు రమణ కొన్ని క్షణాలపాటు ఆమెని అలాగే చూస్తూ వుండిపోయేడు.

పారిజాతం మౌనంగా నిలబడింది. పారిజాతం అందమైంది. ఆమె నిజానికి తారకన్నా, వసంతకన్నా కూడా బాగుంటుంది.

పారిజాతం "బావా" అని తియ్యగా పిలుస్తుందని ఎదురు చూశాడు రమణ. తను గదిలో కొచ్చినా ఆహ్వానించకుండా కూర్చున్న అతన్ని పలకరించాలంటే జంకుగా వుంది పారిజాతానికి. మనసులో ఏమున్నదో కానీ ఆమె గుండెలు అందోళనతో అదురుతున్నాయి.

రమణ మెల్లగా లేచి వెళ్ళి ఆమె వెనకగా నిలబడ్డాడు.

'పారిజాతం, నిన్ను నేను ప్రేమిస్తున్నాను-నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా' అని అడగాలనుకున్నాడు.


కానీ ఆమెని ముట్టుకోవాలంటే ఏదో సంశయం అతన్ని పీడిస్తోంది. చుట్టూ తిరిగి ఆమె ముందుకెళ్ళి నించొన్నాడతను.

"పారిజాతం!" అని పిలిచేడు.

"ఊఁ" అంది బిడియంగా, తలెత్తి చూడ్డానికి ప్రయత్నిస్తూ. ఆమె కనురెప్పలు రెపరెపలాడేయి.

# శిశిరం

రాలుతున్నవి పండుటాకులే
దాగివున్నాయి క్రొంజివురులు
మరి ...



వాలిపోయిన కళ్ళల్లో ఏవీ ఆనం
దాశ్రువులు?
ఎండిపోతున్న గరికమొక్కకి
ఎప్పుడూ వసంతం?

— శోభ

"నేనంటే నీ కిష్టమేనా?" అని అడిగాడు.

అతనడిగిన ప్రశ్నకి పారిజాతం గుండెలు గుబగుబలాడేయి. 'ఆ ప్రశ్నకి సమాధానం ఏమని చెప్పాలి? చెప్పగలిగే సాహసం నాకున్నదా?' మనసులోనే అనుకున్నది పారిజాతం.

"మాట్లాడవేం పారిజాతం?" అడిగేడు రమణ మళ్ళీ. పారిజాతం తలెత్తి చూసింది. ఆటు తర్వాత ధైర్యంగా ఓ అడుగు ముందుకేసి అతని గుండెలపైన వాలిపోతూ-

"నువ్వంటే నా కెంతో ఇష్టం బావా!" అంది.

ఆ మాటలు ఆమె గుండె లోతుల్లోంచి రాలేదు. పెదవి పై నుంచి జారిన నీటి మాటలని రమణకి ఏ మాత్రం తెలీదు.

పారిజాతం మాటలు రమణ గుండెల్లో పన్నీరు చిలికించినయి. 'పారిజాతం మంచిది' అనుకున్నాడు. అదే సమయంలో అతని కెమసగా దెయ్యంలా ఓ ప్రశ్న ఉదయించింది.

'పారిజాతం నిజమే చెబుతోందా? ఆమె నాకు అర్థమైనట్టేనా? పెళ్ళి చేసుకున్నది గనక, ఇక ముందు తనతో కలిసి జీవితమంతా బతకవలసిన అవసరం ఉన్నది కనక పారిజాతం అలా అన్నదేమో! కాని నిజానికి ఆమె మనసులో తనపట్ల ఉన్న అభిప్రాయమేమిటో తను ఎలా తెలుసుకోగలడు?'

ఆ నిజాన్ని అంచనావేయటంలో రెండుసార్లు చావు దెబ్బ తిన్నాడు రమణ. అతనదే ఆలోచిస్తున్నాడు. అందరు ఆడవాళ్ళనీ ఒకేలా భావించటం తప్పని అంతరాత్మ అతనికి బోధిస్తోంది.

అదే సమయంలో "బావా" అని పిలిచింది పారిజాతం.

రమణ పారిజాతం మొహంలోకి చూసేడు. మొదటి రాత్రి అనుభవం కోసం ఆమె గంపెడాశతో ఎదురుచూస్తోందనుకున్నాడు రమణ.

రమణ ఆమెని పొదివి పట్టుకుని మంచం దగ్గరికి నడిపిస్తుంటే— 'నేను కాబజారినదాన్ని. ఫలితంగా నా కడుపులో పెరిగే శిశువుకి నిన్ను తండ్రిని చెయ్యాలని హడావుడిగా నాన్న ఈ పెళ్ళి చేసేడు బావా. నిన్ను మోసం చేస్తున్నానని నాకు తెలుసు. కానీ నిజాన్ని చెప్పి నా బతుకుని నేను పాడుచేసుకోలేను. నన్ను క్షమించు' అని మనసులోనే అనుకున్నది పారిజాతం.

●


## ఋణం

వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతులమీద ధనము. వ్యాపారం. షాపులు, భూములు, బిల్డింగ్స్, లిమిటెడ్ కంపెనీలు, ఇండస్ట్రీలు వగైరాలపై రు. 20.000 లేక ఆ పైన ఋణం లభించును.
వ్రాయండి లేదా సంప్రదించండి.　ఫోన్ : 395126

**SUPREME CORPORATION (BANKERS)**
F-18, "EVEREST" 7th Floor, Near Famous cine laboratory,
Tardeo Road, BOMBAY-400 034.
ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో.